
# కాల్ గర్ల్

**–గోళ్ళ ప్రకాష్**

శయనంతో ఎందరినో సౌఖ్యతీరాలకు చేర్చి ఆమె అలసటగా మేను వాల్చింది. మాగన్నుగా నిద్రపట్టింది. ఇంతలో బజర్ మోగింది. పడుకుని కొద్దిసేపు కాలేదు. అప్పుడే ఎవరొచ్చారో? కిరణ్ కాదు గదా! లేచి బద్ధకంగా ఒళ్లు విరుచుకుని టైంపీస్ వంక చూసింది. మధ్యాహ్నం పన్నెండు గంటలు కావొస్తోంది. విండో గ్లాసెస్ లోంచి పడుతున్న ఎండ చురుక్కుమనిస్తోంది. లేవాలనిపించలేదు. ఆమె అలసటకు, అసహనానికి స్ప్రింగ్‌కాట్ మీది ఫోంబెడ్ ఇబ్బందిగా నలుగుతోంది. డన్‌లప్ పిల్లోని గట్టిగా హృదయానికి హత్తుకుంది తన నుంచి పారిపోవాలనుకున్న ప్రియుణ్ణి బిగికౌగిలిలో బంధించినట్టు.

హబీబా..హబీ. అది తనకి సుపరిచిత కంఠం. వచ్చింది కిరణే. మళ్ళీ బజర్ మోగింది. చిరాకు, విసుగు, అసహనం అన్నీ ఒక్కసారిగా ఎగిరిపోయాయి. నీలాకాశంలో దూది పింజలులా తేలిపోయే మబ్బులా ఆనందంతో గంతులు వేస్తోంది. 'ఎస్. కమింగ్' అంటూ ఆమె గొంతులోంచి వెలువడిన పలుకులు బయటికి విన్పించాయో లేదో కాని బజర్ మళ్ళీ మోగలేదు. మెల్లిగా మంచం దిగి ఫోమ్ చెప్పల్స్‌లో పాదాలు దూర్చి వయ్యారంగా అడుగులు వేస్తూ వెళ్ళి డోర్ తెరిచింది. ఎదురుగా కిరణ్.

"వెల్‌కమ్! కిరణ్ డార్లింగ్!అర్ధనిమీలిత నేత్రాలతో అతని వంక మత్తుగా చూసింది. తన అలసటను పారద్రోలడానికి అన్నట్టు రెండు చేతులూ పైకెత్తి ఒళ్ళు విరుచుకోవడంతో ఆమె వక్షద్వయం అతడిని కవ్వించింది. అతని చూపులు కాసేపు ఆమె ఎదపొంగుల్లో ఇరుక్కొని ఆతర్వాత ఆశగా ఆమె అందాల్ని తడుముతున్నాయి. ఆమె ధరించిన ఉల్లిపొరలాంటి సీత్రూ నైటీ అతని సౌందర్యాన్వేషణకు పెద్ద అవరోధం కాలేదు. సాధారణంగా ఆమె ఇంట్లో వున్నప్పుడు ఆ డ్రెస్సే వేసుకుంటుంది. అందుకే అందాలను ఆస్వాదించాలనుకున్నప్పుడల్లా కిరణ్ ఆసమయంలోనే ఆమె దగ్గరికి వస్తాడు. హబీబా అందాల విందు అతడికి కొత్త కాకపోయినా రోజూ సౌందర్యోపేతమైన షడ్రుచుల విందారగించినట్టు వుంటుందతనికి. రా కిరణ్! లోపలికి రా! అక్కడే వుండిపోయామే! ఏమిటా చూపులు కొత్తగా? అందుకోవాలని యత్నించినా అందనంత దూరంగా, వేగంగా జరుగుతూ దోబూచులాడుతూ కన్ను గీటుతూ బాత్‌రూమ్‌లోకి దారితీసింది.




ఆమె చూపులే కోర్కెల తూపుల్లా వుంటాయి. సెలయేటి గలగలలా వుండే ఆమె నవ్వంటే అతనికి చచ్చే ఇష్టం. అయితే ఆ సౌందర్య రాణిని శాశ్వతంగా తనతో వుంచుకోవడానికి మాత్రం అతడి మనసు ససేమిరా అంగీకరించదు. పరిమళం వెదజల్లే ఆమె శరీరం పరవశాన్ని కలిగిస్తుంది. అయితే అది నిజంగా 'పర'వశం అయింది కూడా. హృదయం, శరీరం రెండూ వశమైనప్పుడే ఆడదాని నుంచి మగాడు సుఖపడతాడు. అయినా ఆమె విటుల కోసం ఎదురు చూసే విరహోత్కంఠిత. ఒక కళంకిత. తనకు అంకితం కాని అందాన్ని, హృదయాన్ని సొంతం చేసుకోవాలని అనుకోవడం అవివేకం. ఆ అందం సౌఖ్యమిస్తే చాలు. అదీ అతడి అంతరంగం. భార్య ప్రతిమ అనుభవాన్ని, సుఖాన్ని మాత్రమే ఇస్తుంది. హబీబా ఆనందానుభూతుల్ని, మనశ్శాంతిని కూడా ఇస్తుందనిపిస్తుంది అతడికి.

షవర్ లోంచి నున్నటి ఒంటిపై నుంచి జారుతున్న నీటిలానే ఆమె ఆలోచనలు కూడా జారుతున్నాయి. కిరణంటే ఆమెకు తగని మోజు. కండలు తిరిగిన శరీరంతో మగటిమి ఉట్టిపడినట్టుగా వుండే కిరణ్ పొందులో వుండే తృప్తి మరే మగాడి దగ్గరా లభించదు. తన దగ్గరికి ఎంతో ఖరీదైన మగాళ్ళు వస్తారు. పిలిస్తే చాలు తను రంజుభలే రామచిలకలా వాలిపోతుంది. రసికుల్ని రంజింపజేస్తుంది. వాళ్ళు తన పొందుకోసం ఎంత ధనాన్నైనా గుప్పిస్తారు. అలాంటి వాళ్ళకు శరీరాన్ని మాత్రం అప్పగించి రబ్బరు బొమ్మలా మారుతుంది తను. అక్కడ ఒక కిరాయి మనిషిగా మారుతుంది తప్ప ఒక ఆనందం, ఒక అనుభూతి వుండవు. మిగతా వాళ్ళలా కాక కిరణ్ కళ్ళలో ఆరాధన నింపుకుని తన శరీరంలో అణువణువునా దాగిన అందాల్ని ఆరాధిస్తాడు. అందుకే అతడికి ఎంతో ఇష్టంగా అర్పించుకుంటుంది. అతడితో ప్రణయం నెరుపుతున్నప్పుడు మధురంగా వుంటుంది. కిరణ్ సాహచర్యం, అతడి పొందు కావలసినప్పుడల్లా ఫోన్ చేసి అతడిని రప్పించుకుంటుంది హబీ. స్నానం పూర్తిచేసి బయటికి వచ్చింది హంస నడకతో. ఒంటికిచుట్టుకున్న టర్కీ టవల్ ఆమె అందాల్ని



ఏమాత్రం దాచక పోగా అతడిని మరింతగా కవ్వించేట్టు చేసింది. ఆమె విగ్రహం అతడి నిగ్రహాన్ని ఆమడదూరం పారద్రోలింది. జారిన టవల్ అతడి చూపులనూ దిగజార్చింది. ఇక నిలువలేక అమాంతం ఆమెను బిగి కౌగిట బంధించి డబుల్ కాట్ వద్దకు నడిపించాడు. అవిశ్రాంత శృంగార కేళీ విలాసానికి నిదర్శనంగా ఇరువురి శరీరాలు అలసటగా తడిచాయి స్వేదంతో. ఆమె తృప్తిగా అటు, అతడు ఇటు తిరిగారు.

ఆమెను మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి. కిరణ్ సాహచర్యాన్ని సొంతం చేసుకోవాలి. అతని సాన్నిహిత్యాన్ని శాశ్వతం చేసుకోవాలి. అదే ఇప్పుడు తన బ్రతుక్కి మిగిలిన ఆశ. అతని కళ్ళల్లో తనపట్ల వున్న ఆరాధనని గమనించినప్పుడు తన కోసం ఏమైనా చేస్తాడనే నిశ్చింత తనకు కలిగింది. ఆ నిశ్చింతతోనే ఇన్నాళ్ళూ తను ఇంత ధైర్యంగా వుంది. ఇక లాభం లేదు. ఒకరి సౌఖ్యం కోసం పవళింపు కోసం తాను సొమ్ముగా, అంగడి బొమ్మలా వుండి ఈ నరకాన్ని అనుభవించలేదు. గతి లేకనే తానీవృత్తిలోకి అడుగుపెట్టింది. అడుగుపెట్టింది అనేకంటే, తన పొరపాటే తననీ వృత్తిలోకి నెట్టింది అనడం సబబు. ఆంధ్రా యూనివర్శిటీలో చదువుతున్నప్పుడు ఎన్ని రంగుల కలలు కన్నది తను? రాజేంద్ర తీయని మాటలకు లొంగిపోయేకదా ఈ వూబిలో తాను దిగాల్సివచ్చింది? 'సుఖాల వీణలు మీటేందుకు జీవితంలో స్థిరపడేందాకా ఆగాలా? ఫాస్ట్‌గా వుండాలి. ఇంకా బొమ్మ కాలంలోనే వున్నావు నీవు. నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నానని మాటలతో అంటే చాలదు. చేతల్లో చూపించాలి' అంటూ రాజేంద్ర రెచ్చగొట్టడం వల్లనే కథా తాను అతనికి అర్పించుకుంది? తప్పు అతనొక్కడిదే కాదు. తనదీనూ. ఇది జరిగిన వారం రోజులకి రాజేంద్ర నిజస్వరూపం తెలిసింది. రాజేంద్ర కావాలని తనని ట్రాప్‌లో పడేశాడని అతడి స్నేహితుడితో సీక్రెట్ లెన్స్ వీడియోతో ఫిలిం తీయించిన భయంకర నిజం అతడి బ్లాక్ మెయిల్‌చేసినప్పుడు కాని తెలిసిరాలేదు తనకి. ఆ నయవంచకుడి బారినుంచి ఎలాగో తప్పించుకుని భాగ్యనగరం వచ్చి కాల్‌గర్ల్‌గా మారిన అభాగ్యురాలు తను. తనని ఈ ఊబిలోంచి బయటపడేసే ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. ఆలస్యం చేస్తే అమృతం విషం కావొచ్చు. ఆలోచనలు ప్రవాహమై ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయామెను. అడిగితే కిరణ్ కాదనకపోడు. తన కోర్కె మన్నించకపోడు. ఎలాగో ధైర్యం కూడదీసుకుంది. మాటలు గొంతు దాటాయి. తన గొంతేనా?

'కిరణ్!'

ఆమె నోటి నుంచి వెలువడ్డ తనపేరు తనకే మధురంగా అనిపించింది కిరణ్‌కు.

'నిన్నొక కోరిక కోరుతాను తీరుస్తావా? అది నీవల్ల తీరే కోర్కే. అందుకే నిన్ను అడిగాను. నిజానికి ఈ కోర్కె కోరడానికి నేనెంత మథనపడ్డానో నీకు తెలియదు. నిద్రలేని నిశి రాత్రుల్లో విహరించాను వేదనతో. ఎంతో ఆలోచించిన మీదట ఈ కోరిక కోరుతున్నాను. నాకు ధైర్యం వుంది. నీవు నా మాట మన్నించగలవన్న నమ్మకం వుంది. ఒక సారి వంచనకు గురై ఇలా మారాను. నేను కోల్పోయిన మనశ్శాంతిని నీలో వెదుక్కున్నాను. నీ సాహచర్యంలో నన్ను నేను మర్చిపోతాను. నాకింకేమీ గుర్తురావు. కాకిలా కలకాలం బ్రతికే కంటే హంసలా ఒకరోజు బతికితే చాలు.

'విత్ ప్లెజర్! అడుగు హనీ! నాదగ్గర ఎందుకు సంకోచం? ఆస్క్ మీ విథౌట్ హెసిటేషన్!'


"నన్ను.. నన్ను.. అదే నన్ను నీదానిగా స్వీకరిస్తావా?'

అది ప్రశ్న కాదు శరాఘాతం. అతడి నోట మాట రాలేదు. ఆమె ఇలాంటి ప్రశ్న అడుగుతుందని వూహించలేదు. ఆమెది కోర్కె కాదు. శాశ్వతంగా ఆమె బాధ్యతను స్వీకరించాలా? అతడిలో ఆలోచనలు పోటెత్తుతున్నాయి.

'ఈ మానసిక వ్యధ ఇంక భరించలేను. ఈ చీకటిలో మరిక జీవించలేను. నన్ను చూసినప్పుడు నీ కళ్ళల్లో కనిపించే వెలుగు సాక్షిగా నిన్నీ కోర్కె కోరుతున్నాను. నీవే ఇప్పుడు నా ఆశాకిరణానివి. నన్నీ కూపం నుంచి లాగుతావో, ఇంతే పడి వుండమని శాపమిస్తావో నీ ఇష్టం" అంది సజల నయనాలతో.

అతడింకా షాక్ నుంచి కోలుకోలేదు. ఆమె అందం పట్ల అంతులేని ఆరాధనా, ఆమె గడుపుతున్న జీవితం పట్ల ఒకింత జాలీ వున్నాయి. కానీ శాశ్వతంగా తనదానిగా చేసుకోడానికి ఎందుకో తన హృదయ వైశాల్యం అంగీకరించడం లేదు. తాను కూడా ధనం బలంలో మాన్యుడైనా ఆలోచనల్లో తానింకా సామాన్యుడే. తను తల్చుకుంటే ఆమెని పూలబాట నడిపించగలడు. ఆమె పరువాల రెమ్మ. బాపూ గీచిన బొమ్మ. హంపీ శిల్పంలో ఒంపులు, 'ఖజురహో' సొంపుల 'మేని'కలయిక. కోరి వచ్చిన తనకి స్వర్గం చూపే రసాధి దేవత. తన శృంగార నాయిక. తనో స్టన్నింగ్ బ్యూటీ. వీనస్. ఆమె ఓ గులాబీ. గులాబీకి రక్షణగా వుండే ముల్లులా కొంతకాలం వుండగలడు. కానీ శాశ్వతంగా ఎలా

చేరదీస్తాడు. పైగా తాను వివాహితుడు. ఆమె ఒక కాల్ గర్ల్‌గా జీవిస్తోంది. అన్నీ తెలిసి కూడా హబీ ఎలా అడగగలుగుతోంది? పోనీ ఒక ఉద్యోగం చూపమంటేనో, కొంత డబ్బు ఇమ్మంటేనో తాను క్షణాల్లో చేసేవాడు. కానీ ఆమె అడిగింది వేరు. దానికి డబ్బు కాదు కావలసింది. ధైర్యం. తెగువ. ఆమె కోరిన కోర్కె నిజానికి తన పరిధిలో పరిష్కారం, పాజిటివ్ సమాధానం లేని మిలియన్ డాలర్ క్వశ్చన్. ఆమె పరివర్తన, పశ్చాత్తాపాన్ని, కష్టాన్నీ, బాధను, వేదనను, ఆవేదనను, ఆవేశాన్ని, ఆలోచనను, బ్రతుకు పట్ల మమకారాన్నీ తాను అర్ధం చేసుకోగలడు. కానీ తన పరిధి విస్తృతం కాదు. ఆలోచనలు దహిస్తున్నాయి. ఆమె తనకి స్వర్గసౌఖ్యాలు ఇస్తోంది. నిజం. మనశ్శాంతినిస్తున్నదీ నిజం. అందుకు ప్రతిఫలం కూడా ఎన్నడూ కోరలేదు. కానీ ప్రతిఫలం ఇలా అడుగుతుందని తాను తాను వూహించలేకపోయాడు. ఆలోచిస్తున్నాడు. ఆమె అడిగిన దానికి నోరు ఎలా విప్పాలా? ఏమి చెప్పాలా? అని సంశయిస్తున్నాడు.





అతడి సమాధానం కోసం ఆమె కోటి ఆశలు నింపుకుని ఎదురుచూస్తోంది. పోనీ ఆలోచించుకోవడానికి గడువు అడుగుతాడేమో! వివాహితుడిని పెళ్ళి చేసుకుంటే తనని ఉంపుడుగత్తె అంటారు లేదా మరీ పచ్చిగా సెకెండ్ సెటప్ అంటారు. అది తనకి గౌరవనీయ హోదా కాదని తెలుసు. కానీ తానింకా ఈ సమాజంకోసం జీవించలేదు. తనకోసం బ్రతకాలిక. అది గౌరవనీయ హోదా అని తెలియకపోయినా ఇప్పుడు తను జీవిస్తున్నంత హేయమైంది మాత్రం కాదని తెలుసు.

కిరణ్ పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. తనంటే ఎంతో అభిమానం చూపే హబీ మనసు నొప్పించాలంటే ఎలాగో వుంది. తనిచ్చే సమాధానంతో ఆమె తనకు దూరమౌతుంది. ఆమె శాశ్వతంగా తనకు దగ్గరవ్వాలనుకుంటోంది. తానిచ్చే సమాధానంతో మాత్రం ఆమె తనకి శాశ్వతంగా దూరమైపోతుంది. ఆమె తన జీవితపు ఎడారిలో లభించిన ఒయాసిస్సు. వదులుకుంటే తన దాహం తీరదు. ఉంచుకుందామంటే ఒప్పుకోదు మనసు. ఒయాసిస్సులున్న చోట ఇసుక తుపానులూ వుంటాయి. తట్టుకోవాలి. తప్పదు. ఇక మౌనంగా వుండడం క్షేమం కాదు. మౌనం దాల్చితే ఆమెలో ఆశలు రేపినట్టవుతుంది.

హబీ దిండుని ఒళ్ళో పెట్టుకుని కూర్చుని అతడికేసి దీర్ఘంగా చూస్తోంది. అతని సమాధానంకోసం కళ్ళు పత్తికాయల్లా చేసుకుని ఎదురుచూస్తోంది. నరాలు తెగే ఉత్కంఠ.

నెమ్మదిగా నోరు విప్పాడు కిరణ్. 'చూడు హబీ! నీవంటే నాకెంతో ఇష్టం. నేను నీనుంచి ఎంతో సుఖాన్ని పొందుతున్నాను. అలాగే నానుంచీ నీవు సుఖాన్ని పొందుతున్నావు. నన్ను నీవు ఎప్పుడూ ఏదీ అడగలేదు. మన సంబంధం అనైతికం కావొచ్చు. కాని మనం మంచి స్నేహితులం.




స్నేహం శాశ్వతమైతేనే మధురంగా వుంటుంది. కాని శాశ్వత బంధం అయితే అందులో కొత్తదనం వుండదు. సరికదా! పండగనాడూ పాతమొగుడేనా! అన్నట్టుగా థ్రిల్లుండదు. దూరంగా వుండి అప్పుడప్పుడు కలుసుకోవడంలోని ఆనందం దగ్గరగా వుండి తరచూ కలుసుకోవడంలో వుండదు. నన్ను నీవు స్వార్ధపరుడని నిందించవచ్చు. కాని స్వార్ధం లేంది దేనిలో? ఆఖరికి ప్రేమలోనూ స్వార్ధం వుంది. నేను స్వార్ధపరుడని నీవనుకుంటే నాదీ స్వార్ధమే! నీదీ స్వార్ధమే! స్వార్ధంలో కూడా పరమార్ధముందని నా నమ్మకం. నిన్ను చేరదీస్తే లోకం ఒప్పుకోదని కాదు నా భయం. ఇప్పుడు ఇరువురం పొందుతున్న సుఖశాంతులు అప్పుడు వుండవనే! మనదీ సంసారమైతే సారమేం వుంటుంది? నన్ను క్షమించు. మనసులో ఒకటుంచుకుని పైకి ఒకటి మాట్లాడడం నాకు చేతకాదు. ఇప్పుడు నా మనసు తేలిక పడింది. ఇప్పుడు నిర్ణయం నీది. నన్నింకా నీవు ఇష్టపడితే మళ్ళీ ఫోన్ చేయి. నిర్ణయం ఇప్పుడు నీది. నన్ను రానిస్తావో? లేదో? నీ ఇష్టం. వస్తా! అంటూ డోర్ తీసుకుని బయటికి వెళ్ళడానికి ఉద్యుక్తుడవ్వున్నాడు. తనవాడవుతాడనుకున్న కిరణ్ అలా నిర్దయగా మాట్లాడడం, కరాఖండీగా చెప్పడంతో హబీ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. జీర్ణించుకోలేకపోయింది.

" చూడు కిరణ్! అదే నీ సమాధానమయితే నీవిక రానక్కరలేదు. నేను పెంచుకున్న ఆశలే నన్ను నిత్యం వెక్కిరిస్తే భరించలేను. ప్లీజ్! గెట్ లాస్ట్ ! ఇక నీముఖం నాకు చూపించకు". ఇప్పుడు నాకు మీజాతి మీదనే అసహ్యం కలుగుతోంది. ఇంకెప్పుడూ ఇటుకేసి రాకు. ప్లీజ్! వెళ్ళిపో. ఆమె ఏడుస్తోంది. కళ్ళనిండా నీళ్ళు నిండడంతో తన ముందు ఏమీ కనిపించట్లేదు. తర్వాత చూస్తే కిరణ్ అక్కడ లేదు.